తుదిదశకు హైవే విస్తరణ పనులు

- రూ.150 కోట్లతో జాతీయ రహదారి-26 విస్తరణ
- గజపతినగరం–సాలూరు వరకు 35 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు
- చంపావతి నదిపై వంతెన, గుడివాడ వద్ద మూడు మైనర్ బ్రిడ్జిల నిర్మాణం
- 90 శాతం పూర్తయిన పనులు


గజపతినగరం వద్ద పూర్తయిన రోడ్డు విస్తరణ

దత్తిరాజేరు:

జాతీయ రహదారి-26 గతంలో గోతులతో అధ్వానంగా తయారవడంతో పాటు రోడ్డు విస్తీర్ణం కూడా తక్కువగా ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహన చోదకులు అవస్థలు పడాల్సి వచ్చేది. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను కలిపే ఈ రహదారి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వం మాన్యువల్ ప్లాన్ కింద రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో గజపతినగరం నుంచి సాలూరు వరకు 35 కిలోమీటర్ల మేర విస్తరణ పనులను ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు. ఈపనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. గజపతినగరంలోని చంపావతి నది నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు 1.2 కిలోమీటర్లమేర గతంలో 30 అడుగులు, రెండు లైన్లుగా ఉన్న రోడ్డును ప్రస్తుతం నాలుగు లైన్లు, 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేస్తున్నారు. ఈపనులు శరవేగంగా సాగుతున్నాయి. అభయాంజనేయస్వామి ఆలయం నుంచి సాలూరు వరకు 33.8 కిలో మీటర్ల మేర రోడ్డు పనులను రెండు లైన్లుగా 45 అడుగుల వెడల్పుతో ఇప్పటికే పూర్తి చేశారు. రెండో లేయర్ తారుపూత పనులు కూడా పూర్తయ్యాయని జాతీయ రహదారుల శాఖ జేఈ సురేష్‌కుమార్ చెప్పారు. గజపతినగరం చంపావతి నదిపై ఓ మేజర్ బ్రిడ్జి, గుడివాడ సమీపంలోని గెడ్డలపై మూడు మైనర్ బ్రిడ్జిల నిర్మాణం కూడా పూర్తి కావడంతో వాటిపై నుంచి వాహ నాల రాకపోకలు సాగుతున్నాయి. అలాగే 35 కిలోమీటర్ల హైవే పరిధిలో 75 చోట్ల కల్వర్టులు నిర్మించారు. హైవేలో అవసరమైన చోట బస్సు షెల్టర్లు కూడా ఏర్పాటు చేశారు. గజపతినగరం సమీపంలో పెండింగ్‌లో ఉన్న పనులను చేపడుతున్నారు. బెర్మ్‌లు, రోడ్డు డైవర్సన్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు, సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు గ్రామాల వద్ద రెయిలింగ్ పనులు మిగిలి ఉన్నాయని హైవే ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. గజపతినగరం పట్టణంలో రోడ్డు డివైడర్లను ఆదివారం నిర్మించారు. రోడ్డు పనులు పూర్తవ్వడం వల్ల ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలకు, వస్తురవాణాకు ఇబ్బందులు తప్పాయి. గతంలో అధిక లోడ్‌తో వచ్చే లారీలు గోతుల వల్ల అదుపుతప్పి బోల్తా కొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలతో పాటు స్థానికులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పాయని నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెలాఖరుకు శతశాతం పూర్తిచేస్తాం

రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన అరకొర పనులను ఈ నెలాఖరుకు శత శాతం పూర్తి చేస్తాం. గజపతినగరం పట్టణంలో ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. చంపావతి నది నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు కొంచెం పెండింగ్ ఉన్నాయి. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తాం.

– సురేష్‌కుమార్, జాతీయ రహదారుల శాఖ జేఈ

పూర్తి సహకారం అందించాం



జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుకు తమ వంతు పూర్తిసహాయ సహకారాలు అందించాం. స్థానికంగా అక్కడక్కడా తలెత్తిన సమస్యలను పరిష్కరించాం. పనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి వేగవంతం చేయాలని అధికారులకు, గుత్తేదారుకు ఆదేశించాం. అందరి సహకారంతో పనులు పూర్తి కావస్తున్నాయి. ఇక ట్రాఫిక్ సమస్య ఉండదు. మిగిలిపోయిన చిన్న,చిన్న పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుని ఆదేశించాం.

– బొత్స అప్పలనరసయ్య, గజపతినగరం ఎమ్మెల్యే


గజపతినగరం పట్టణంలో డివైడర్లు నిర్మిస్తున్న సిబ్బంది


పెదమానాపురం సంత వద్ద విశాలంగా రోడ్డు


మరడాం వద్ద పనుల నాణ్యతను పరిశీలిస్తున్న జేఈ సురేష్‌కుమార్

క్లుప్తంగా

నేడు 'స్పందన'

దత్తిరాజేరు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమసమస్యలపై అర్జీలు అందించవచ్చని పేర్కొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మగుంటి పరమేష్, అంబల్ల చిన్నారావు, రెడ్డి అచ్యుతరావు ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి పాఠశాల వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. సీసీ రోడ్డు లేక ఎస్సీ కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల నుంచి రూ.10 లక్షలు సీసీ రోడ్డుకు కేటాయించారని నాయకులు తెలిపారు.

ఆగస్టు 6న వ్యాసరచన పోటీలు

కొత్తవలస: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆగస్టు 6వ తేదీన మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామ ని ఉత్తరాంధ్ర క్విజ్ మాస్టర్, సామాజిక కార్యకర్త కర్రి రాము ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక విధులు అనే అంశంపై 8,9, 10 వతరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో వ్యాసరచన ఉంటుందని, పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురుకి ఆగస్టు 15వ తేదీన బహుమతులు ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9032885795 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీరభద్రస్వామికి సహస్ర ఘట జలాభిషేకం


పూజలు చేస్తున్న అర్చకులు

లక్కవరపుకోట: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, అర్చకులు అక్కాజోష్యుల శ్రీహరిశర్మ నేతృత్వంలో స్వామివారికి లఘు రుద్రాత్మిక సహస్ర ఘట జలాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. 1,294 ఘటాలతో స్వామివారికి జలాభిషేకం చేసిన అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


ప్రారంభానికి సిద్ధం


బలిఘట్టంలో నిర్మాణం పూర్తయిన కొత్తవలస సచివాలయం-3 భవనం


ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

కొత్తవలస: మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం-3 పరిధిలో బలిఘట్టం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉపాధి హామీ పథకం నిధులు రూ.34 లక్షలతో సచివాలయం భవనం, రూ.23 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనాన్ని నిర్మించినట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.నాయుడు తెలిపారు. త్వరలోనే భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామని డీఈ చెప్పారు.

నిరసన


ర్యాలీ చేస్తున్న క్రైస్తవ మతవిశ్వాసులు

బొబ్బిలి: మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్‌లపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక పాతకోర్టు వద్ద బొబ్బిలి ఆర్‌సీఎం సంఘ సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. లౌకిక భారతదేశంలో అన్ని మతాల వారు సమానమేనని, క్రిస్టియన్లపై దాడులు తగవన్నారు. ఫాదర్ మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి


ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు

గంట్యాడ: గ్రామాల్లో ప్రజలు వివాదాలకు దూరంగా ఉంటూ స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రయాణికులు, స్థానికులకు ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యల ను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, అనవసరంగా గొడవలు పెట్టుకోవద్దని హితువుపలికారు. నేరాలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విజయనగరం టౌన్: స్థానిక ఎస్.వి.ఎన్ నగర్‌లో ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయంలో బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు బ్రాహ్మణ విద్యార్థులను ప్రతిభా పురస్కారాలతో ఆదివారం సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పి.సోమరాజు మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లో కూడా రాణించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబీబీఎస్ చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పురస్కారాలతో సన్మానించినట్లు గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ తెలిపారు. అనంతరం సెంచూరియన్ వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ చిలుకూరి శాంతమ్మను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు డీవీ శ్రీకాంత్, అధ్యక్షుడు భోగరాజు బాబూజీ, కోశాధికారి మంగిపూడి శివరామయ్య, కార్యదర్శి ఇనుగంటి రమేష్ పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ


రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం

దత్తిరాజేరు: కోమటిపల్లి–గర్భాం రోడ్డు నుంచి మండలంలోని వంగర గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఏఎంసీ నిధులు రూ.60 లక్షలతో పనులు చేపడుతున్నట్లు డీఈ అప్పలనాయుడు తెలిపారు. కోమటిపల్లి–గర్భాం రోడ్డులో వంగర కూడలి నుంచి ఆ గ్రామానికి వెళ్లే మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డు పూర్తిగా శిథిలమైంది. రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు అవస్థలు పడాల్సి వచ్చేది. రోడ్డు పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభమయ్యాయి. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని డీఈ చెప్పారు.

ఏరియా ఆస్పత్రిలో స్వీపర్ల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిని ప్రభుత్వం 30 పడకల నుంచి 100 పడకల స్థాయికి పెంచడం చాలా సంతోషమని, అయితే 100 పడకల స్థాయికి తగ్గట్లు తగిన స్వీపర్లను నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆస్పత్రి ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వీపర్లకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందని అన్నారు. గజపతినగరం నియోజకవర్గం ఏఐటీయూసీ కన్వీనర్‌గా కామ్రేడ్ పురం అప్పారావును, కో-కన్వీనర్‌గా గేదెల రాము నాయుడును నియమించినట్లు చెప్పారు. ఆస్పత్రి శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

నేడు బల్లంకి, బానాదిలో 'జగనన్న సురక్ష'

వేపాడ: మండలంలోని బానాది, బల్లంకి గ్రామ సచివాలయాల్లో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి. ఎస్.ఎస్.కె.పట్నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పట్నాయక్ రెండు బృందాలుగా బానాది, బల్లంకిలో నిర్వహించే 'జగనన్న సురక్ష' క్యాంపులకు హాజరై ప్రజలకు ధ్రువపత్రాలు అందజేయనున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రజల నుంచి అర్జీలు కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌కు పరామర్శ


నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యనారాయణ

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును విశాఖ పట్టణం ఎంపీ ఎం.వి.వి సత్యనారాయణ, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలిసి పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నర్సింగరావు ఈ నెల 13న స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీలు విజయనగరంలోని ఆయన స్వగ్రామానికి ఆదివారం వెళ్లి, నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆశాజనకంగా చిరుధాన్యాల సాగు


కొత్తవలస మండలం చీడివలసలో కోతదశకు చేరుకున్న కొర్ర పంట


కొత్తవలస మండలం చీపురవలసలో సాగులో ఉన్న గంటిపంట

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గంలో చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొర్రలు, సాములు, అండు కొర్రలు, రాగులు, గంటెలు వంటి చిరుధాన్యాలను రైతులు గతంలో విస్తారంగా సాగుచేసేవారు. కొన్నాళ్లకు వీటి వినియోగం తగ్గింది. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వైద్యులు సూచిస్తుండడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. దీంతో నియోజకవర్గంలో వీటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. నియోజకవర్గం పరిధిలో కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో ఈ సుమారు 15 వందల ఎకరాల్లో చిరుధాన్యాలను రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే సంప్రదాయ పంటలను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు చిరుధాన్యాల విత్తనాలను రాయితీపై, కొన్నిరకాల విత్తనాలను ఉచితంగానే అందజేస్తోంది.

ఘనంగా పశువులమ్మ పండగ


పశువులను ఒక చోటుకు చేర్చి పూజలు చేస్తున్న రైతులు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో పశువులమ్మవారి పండగను గ్రామస్తులు ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ వరి నాట్లుకు ముందు పశువులమ్మ వారికి పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్తులు పశువులు, మేకలు, గొర్రెలను ఒక చోటుకు చేర్చి వాటిపై ఉదకాన్ని చల్లి పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూడు తల్లి అని అమ్మవారిని వేడుకున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


అమ్మవారికి ఊరేగింపుగా సారే తీసుకువస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: ఆషాడమాసం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్ నేతృత్వంలో ఆదివారం సారె సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష,ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు గంట్యాడ బుజ్జి, వంకల కృష్ణ, కంది శ్రీరాములు, రేగిడి అప్పలనాయుడు, అడ్డాల రవి, అడ్డూరి లక్ష్మి తదితరులు ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన నృత్య సంగీతార్చన


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన అష్టోత్తర శత నృత్య సంగీతార్చన అలరించింది. విశాఖకు చెందిన పరిమళ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ నృత్య కళాకారిణి, పరిమళ అకాడమీ డైరెక్టర్ లిపికారెడ్డి కూచిపూడి నృత్యం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య కళాకారిణి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 108 వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నృత్య సంగీతార్చన పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతిచోటా తమకు ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జాతీయ రెడ్డి జేఏసీ అధ్యక్షుడు ఎం.బాలబ్రహ్మారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'కథ చెబుతారా.. ఊ.. కొడతాం'..కు విశేష స్పందన


పోటీల్లో పాల్గొన్న వారితో టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ శ్యామ్‌సుందర్

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం), హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నీతికథల పోటీలకు విశేష స్పందన లభించింది. కథ చెబుతారా.. ఊ..కొడతాం.. పేరిట చేపట్టిన ఈ పోటీలకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి మొత్తం 80 మంది హాజరయ్యారు. జూనియర్ విభాగంలో 45 మంది, సీనియర్ విభాగంలో 35 మంది పోటీల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు చేపట్టామని టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపకుడు మజ్జి కాంతారావు ఆధ్వర్యంలో స్థానిక కనపాక, తదితర ప్రాంతాల్లో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేసి, పదో తరగతి టాపర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇష్టం, కఠోర శ్రమ, అకుంఠిత దీక్షతో చదివితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. క్రమశిక్షణతో పాటు ప్రణాళికబద్ధంగా చదవాలని విద్యార్థులకు సూచించారు. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కారని, ఓ లక్ష్యంతో కష్టపడితే సమాజంలో గుర్తింపు పొందుతారన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ ఎం.మురళి మాట్లాడుతూ మంచి లక్ష్యం, దృఢ సంకల్పం ఉంటే మంచి విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా 500 మార్కులు పైబడి సాధించిన 17 మంది ు నగదు బహుమతి, ఉత్తమ ఫలితాలు సాధించిన మరో 42 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.ఎస్.రావు, రామ, మజ్జి ఆదిబాబు, సారిపల్లి అప్పారావు, పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.